క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): పట్టణంలోని కాలనీలన్నింటికీ ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీరాంకాలనీలో బీఆర్‌ఎస్‌ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో తాగునీళ్ల గోస తీరిందని తెలిపారు. గతంలో కనీసం పార్కులు, రోడ్లు, డ్రెయినేజీలు కూడా లేని దశ నుంచి ప్రస్తుతం ఊహించని విధంగా పట్టణం అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ నర్సింహులు, ముడా చైర్మన్‌ వెంకన్న, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గణేష్‌, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు శివరాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శశిభూషన్‌, సిద్దు, పర్వతాలు, శ్రీరాములు, భాస్కర్‌, కిషన్‌పవార్‌ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు కృషి..

జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీ గ్రీన్‌ బెల్ట్‌ వద్ద శాలివాహన, ఏకలవ్య విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రెడ్‌క్రాస్‌ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2023 క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బాలయ్య, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నకల్‌ కష్టయ్య, ప్రధాన కార్యదర్శి భగవాన్‌, జిల్లా అధ్యక్షుడు తిరమలరాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు ప్రారంభం



అడ్డాకుల: మండలంలోని రాచాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కబడ్డీ, వాలీబాల్‌ పోటీలను బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌ ప్రారంభించారు. గ్రామానికి చెందిన సర్పంచ్‌ తల్లి పాశం చెన్నమ్మ జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. చెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆయన చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ తిరుపతయ్య యాదవ్‌, బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మున్నూర్‌ రమేష్‌, బుచ్చన్న, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చైతన్య యువజన కమిటీ ఎన్నిక

పాలమూరు: ఎదిర గ్రామ చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకోకున్నారు. అధ్యక్షుడిగా సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా నరేష్‌, ఉపాధ్యక్షుడిగా విజయ్‌, క్రీడల కార్యదర్శిగా రాజు, సహాయ కార్యానిర్వాహక కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా కృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా నర్సింహులు, సభ్యులు, సహాలదారులను ఎన్నుకున్నారు.

ఏపీపీ రఘుపతికి ప్రశంసాపత్రం



పాలమూరు: జిల్లా కోర్టులో క్రిమినల్‌ కేసుల వాదనలో ఎక్కువ సంఖ్యలో నేరస్తులకు శిక్షపడేలా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ పుట్టపాగ రఘుపతికి ఆదివారం హైదరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ స్టీఫెన్‌ రవీంద్ర ప్రశంసాపత్రం అందజేశారు. గత ఏడాది కాలంలో జిల్లా కోర్టులో అధికంగా క్రిమినల్‌ కేసులలో నేరస్తులకు శిక్ష పడేవిధంగా వాదనలు కొనసాగించాడు. ఉత్తమ సేవలు అందించినందుకు పోలీస్‌ శాఖ నుంచి ప్రశంసాపత్రం రావడం సంతోషకరంగా ఉందని రఘుపతి తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడమేనని ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ జిల్లా శాఖ చైర్మన్‌ లయన్‌ నటరాజ్‌ అన్నారు. రాజస్థాని సమాజ్‌ జియో లైఫ్‌ ఫౌండేషన్‌, రాజస్థాని నవ యువక్‌ మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌ రాజస్థాన్‌ భవన్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్‌ నటరాజ్‌ మాట్లాడుతూ తలసేమియాతో బాధపడే చిన్నారులకు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి, రోగులకు ఈ రక్తాన్ని అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఉచిత డెంటల్‌, యూరాలజిస్ట్‌ క్యాంప్‌ నిర్వహించారు. కార్యక్రమంలో బీవీపీ దక్షిణ భారత ప్రాంతీయ కార్యదర్శి జి.పాండురంగం, రాజస్థాని సమాజ్‌ అధ్యక్షుడు ఓం ప్రకాశ్‌ బంగడ్‌, కార్యదర్శి రాజేంద్రకుమార్‌, సురేష్‌ చంద్ర దూత్‌, నవ యువక్‌ మండలి అధ్యక్షుడు ఉమేష్‌ బంగడ్‌, కార్యదర్శి మధుసూదన్‌ లఖోటియా తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న సమస్యలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీ
- మెరుగుపడనున్న సేవలు



ధర్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న టీచర్‌

మహబూబ్‌నగర్‌ రూరల్‌: చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థను ప్రవేశపెట్టింది. వివిధ కారణాలతో ఖాళీ అయిన పోస్టులను ఇన్నాళ్లు భర్తీచేయకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లాలో మహబూబ్‌నగర్‌ అర్బన్‌, మహబూబ్‌నగర్‌ రూరల్‌, దేవరకద్ర, జడ్చర్ల ఐసీడీఎస్‌ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రధాన అంగన్‌వాడీ టీచర్‌ పోస్టులు 29, మినీ అంగన్‌వాడీ 12, ఆయా 123 ఖాళీలు ఉండగా, 2021 సెప్టెంబర్‌లో భర్తీ కోసం నోటిఫికేషన్‌ జారీ చేశారు. 2021 సంవత్సరంలో నోటిఫికేషన్‌ జారీ చేయగా, నియామక ప్రక్రియ పూర్తి చేయలేదు. ఎట్టకేలకు కలెక్టర్‌ ఎస్‌.వెంకట్రావ్‌ ప్రత్యేక దృష్టి సారించి అభ్యర్థులను నియమించడంతో వెతలు తీరనున్నాయి.

కొంత జాప్యం జరిగినా..

ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం పదో తరగతి విద్యార్హత ఆధారంగా నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఆ తర్వాత ఇంటర్‌ ఉండాలని ఉత్తర్వులు జారీ చేయడంతో కొంత జాప్యం జరిగింది. దరఖాస్తులు తీసుకున్న ఏడాదికి నియామక ప్రక్రియను మొదలుపెట్టారు. పదో తరగతిలో మెరిట్‌, స్థానికతను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్‌ వెంకట్రావ్‌ సమక్షంలో ప్రాజెక్టుల వారీగా అభ్యర్థుల ఎంపిక జరిగింది. 29 టీచర్‌ పోస్టులకు గాను 21భర్తీ కాగా, 123 ఆయా పోస్టులకు 80, మరో 12 మినీ టీచర్‌ 9 పోస్టులు భర్తీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ మెయిన్‌, మినీ టీచర్‌, ఆయా పోస్టులు కలిపి మొత్తం 164 ఖాళీలు ఉండగా, అందులో 110 పోస్టులు భర్తీ చేశారు. ఎంపికైన వారికి రెండు రోజుల కిందట రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ నియామక పత్రాలను అందజేశారు. ఖాళీల భర్తీ ప్రక్రియ పూర్తికావడంతో కేంద్రాల్లో సమస్యలు దూరం కానున్నాయి.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..

ప్రాజెక్టు	టీచర్‌	ఆయా	మినీ టీచర్‌
మహబూబ్‌నగర్‌ అర్బన్‌	6	14	2
మహబూబ్‌నగర్‌ రూరల్‌	4	10	3
జడ్చర్ల	9	38	4
దేవరకద్ర	2	18	0

పారదర్శకంగా ఎంపిక..



ఖాళీ పోస్టులను నిబంధనల ప్రకారం మెరిట్‌, స్థానికత అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ఆన్‌లైన్‌ ద్వారా డైరెక్టరేట్‌ నుంచి ఎంపిక ప్రక్రియ చేపట్టాం. కొన్ని పోస్టులకు దరఖాస్తులు రాకపోవడం, సరైన అభ్యర్థులు లేక భర్తీచేయలేదు. కొత్త టీచర్ల రాకతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార సేవలు మెరుగుపడనున్నాయి. నియమితులైన వారు కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో రిపోర్టు చేసి విధుల్లో చేరనున్నారు.

–ఎల్‌.శాంతిరేఖ, సీడీపీఓ, మహబూబ్‌నగర్‌ రూరల్‌

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ మైదానంలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు మండలంలోని గంగాపూర్‌లో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. పోలేపల్లిలో లబ్ధిదారు లావణ్యకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేశారు. అలాగే అజ్మీర్‌దర్గాకు చాదర్‌ను ఎమ్మెల్యే సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ యాదయ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లక్ష్మి, వార్డు కౌన్సిలర్స్‌ ప్రశాంత్‌రెడ్డి, రఘురాంగౌడ్‌, నందకిషోర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టికి బదులు మొర్రం



రాజాపూర్‌: మనస్సుకు ఆహ్లాద వాతావరణం కలిగేలా పచ్చదనం ఏర్పాటు చేసేందుకు ఎర్రమట్టి వాడాల్సి ఉండగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తమ ఇష్టవచ్చినట్లు ఎర్రమట్టి స్థానంలో మొర్రం వేసి అక్రమాలకు పాల్పడుతున్నారని మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామశివారులో ఉన్న సెజ్‌లోని ప్రధాన రహదారులకు ఉన్న సెంట్రల్‌ లైటింగ్‌ ఏర్పాటు చేసి వాటి మధ్యలో నిర్మించిన డివైడర్ల మధ్య ల్యాండ్‌ స్కేప్‌ ఏర్పాటు చేసేందుకు టీఎస్‌ఐఐసీ ఆదేశానుసారం ల్యాండ్‌ స్కేపింగ్‌ చేస్తున్నారు. అయితే ఎర్రమట్టి వేసి దానిపై గ్రీనరీతో పాటు మొక్కలు నాటాలి. అందుకు విరుద్ధంగా ఎర్రమట్టి స్థానంలో మొర్రం పోస్తే గ్రీనరీ ఎక్కడ పెరుగుతుందని కాంట్రాక్టర్‌కు, టీఎస్‌ఐఐసీ అధికారులకు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కురుమూర్తిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లాల్‌కోటలో రూ.20లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం, నెల్లికొండిలో రూ.9లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, కురుమూర్తిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే కురుమూర్తిలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల మాదిరిగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందని కుటుంబమే లేదని, ప్రతి ఒక్కరూ కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజలను మోసం చేస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, సర్పంచ్‌లు కవిత, సంధ్య, అప్పంపల్లి సింగిల్‌ విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ మెంబర్‌ కరుణాకర్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు ఏర్పాటు చేయండి



రాజాపూర్‌: మండలంలోని మల్లేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమ్లాతండాకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు. తండాకు ఉన్న మట్టిరోడ్డు ఉన్నందునా వర్షాకాలం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రెండు కిలోమీటర్లు బీటీరోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అబ్దుల్‌ ఖాదర్‌షా ఉర్సు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దర్గా ఆవరణలో భక్తుల సందడి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లా కేంద్రంలోని హజ్రత్‌ అబ్దుల్‌ ఖాదర్‌షా రహెమతుల్లా అలై ఉర్సు వైభవంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు ప్రతి రోజూ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. మొక్కుబడులు చెల్లించి ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఉర్సు వేడుకలను పురస్కరించుకొని దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. కులమతాలకతీతంగా మహబూబ్‌నగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు దర్గాను దర్శించుకొని పూలు, చాదర్లు అందించారు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా ఆవరణలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఆట వస్తువులు, మిఠాయిలతో పాటు పలు రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉర్సు ఉత్సవాల్లో దర్గా ముతవల్లీ మహ్మద్‌ అబ్దుల్‌ జమీర్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

నవాబుపేట: కొలిచిన వారికి కొంగు బంగారంలా నిలిచి అడిగిన వరాలు ఇచ్చే మైసమ్మ తల్లిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. మండలంలోని పర్వాతపూర్‌ మైసమ్మ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జనసంద్రంగా మారింది.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



దేవరకద్రలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రాచాలలో ఉద్దాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి స్వామి రథాన్ని పట్టణంలోని పురవీధుల ద్వారా లాగుతూ తీసుకెళ్లారు. దారి పొడువునా మహిళలు భక్తిశ్రద్ధలతో రోడ్డుపై కడవలతో నీటిని పోశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రాచాలలో..

అడ్డాకుల: మండలంలోని రాచాలలో వెలిసిన శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి స్వామి రథోత్సవం నిర్వహించారు. అనంతరం తేరును చెన్నకేశవస్వామి దేవాలయం వద్దకు తీసుకువచ్చి ఉత్సవ విగ్రహాలను ఆలయంలోకి తీసుకెళ్లారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఉద్దాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీకాలనీ సమీపంలో ఉన్న ఆలయం నుంచి ఉద్దాలను బయటకు తీశారు. చెన్నకేశవస్వామి నామస్మరణ మధ్య వాటిని ఆలయానికి తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోపన్‌పల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



జిల్లా కేంద్రంలో..



నవాబుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): స్థానిక ప్రభుత్వ బీఈడీ కళాశాలలో 1990 సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం కేసీఆర్‌ ఏకో అర్బన్‌ పార్కులో కలుసుకున్నారు. అప్పటి లెక్చరర్లు నరసింహ, జగదీష్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమాచార శాఖ ఏడీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల ఎంఈఓ మంజుల, రెసిడెన్షియల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ తిరుపతయ్య, రాజేష్‌, రిటైర్డ్‌ టీచర్‌ రాజేంద్రప్రసాద్‌, శ్రీనివాస్‌, రాములు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చదివిన 1999 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం జోకూర్‌ సమీపంలోని తపోవన్‌ స్కూల్‌ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడల్లో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు, డిక్షనరీలు అందించారు.

బడి కూలితే బాధ్యులెవరు?

- కందూర్‌లో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల
- పైకప్పు నుంచి ఊడిపడుతున్న పెచ్చులు



ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు



పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న తరగతులు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతుండంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలలో 51 మంది బాలికలు, 54 మంది బాలలు కలిపి 105 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో 6తరగతి గదులు ఉండగా, అన్ని గదులు శిథిలావస్థకు చేరాయి. తరగతి గదుల్లో పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. వరండాలో అయితే ఇనుప చువ్వలు కూడా బయటకు కనిపిస్తున్నాయి. విద్యార్థులపై ఎప్పుడు పెచ్చులు ఊడిపడుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో మాత్రం భయం వీడటం లేదు.

ప్రత్యామ్నాయం లేదని..

పాఠశాలలో 105 మంది విద్యార్థులు చదువుకుంటుండటంతో ఇక్కడి బడిని మరోచోటకు తరలించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో గ్రామంలో మరో చోట ప్రత్యామ్నాయం లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో ఉపాధ్యాయులు శిథిల భవనంలోనే తరగతులను కొనసాగిస్తున్నారు. చాలాసార్లు విద్యార్థులను ఆరుబయట కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. ఇదే పాఠశాలలో ఓ గదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మరో చోటుకు తరలించారు. పాఠశాల భవనం శిథిలమైనందునా ఎక్కడికి మార్చాలన్న దానిపై సందిగ్ధం నెలకొంది.

కూలితే బాధ్యత ఎవరిది..

పాఠశాల భవనం ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని ఇంజినీరింగ్‌ అధికారులు కూడా ధ్రువీకరించారు. మరో ప్రత్యామ్నాయం చూసుకుని పాఠశాలను మరో చోటికి తరలిస్తే బాగుంటుందని సూచించారు. అయితే బడిని ఎక్కడికి మార్చాలన్న దానిపై ఏర్పడిన సందిగ్ధంతో ఎవరూ దీనిపై నిర్ణయం తీసుకోవడం లేదు. ఈ విషయాన్ని స్థానిక హెచ్‌ఎం రాములు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. శిథిలమైన భవనంలో చదువుకుంటున్న తమ పిల్లలకు ప్రమాదం జరిగితే బాధ్యులెవరని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

భయంగా ఉంది..

పాఠశాల భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు మాపై పడుతాయో తెలియని విధంగా ఉంది. వరండాలో కూడా ఇనుప చువ్వలు బయటకు తేలాయి. బడిలో ఎప్పుడు భయం భయంగానే చదువుకుంటున్నాం.

– ఈశ్వర్‌, 5వ తరగతి, కందూర్‌

ప్రత్యామ్నాయం చూడాలి..



పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. తరగతి గదుల్లో పైకప్పు, గోడలకు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు విన్నవించాం. మరో చోట ప్రత్యామ్నా యం ఏర్పాటు చేస్తే బడిని అక్కడికి మారుస్తాం.

– వి.రాములు, పీఎస్‌ హెచ్‌ఎం, కందూర్‌

అధికారులు చొరవ తీసుకోవాలి..



ప్రాథమిక పాఠశాలలో 105 మంది విద్యార్థులు ఉన్నారు. బడి శిథిలావస్థకు చేరినందు నా మరోచోట ఏర్పాటు చే యాలని పంచాయతీ ద్వారా నోటీసు కూడా ఇచ్చాం. అయి నా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవడం లేదు. మన ఊరు–మన బడికి ఎంపిక చేస్తే సమస్య తీరేది.

– శ్రీకాంత్‌, సర్పంచ్‌, కందూర్‌